ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 08.01.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు సాయంత్రం విశాఖపట్టణంలో రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

2. రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుపై విధాన పరమైన నిర్ణయం తీసుకున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

3. కరీంనగర్ లో ఇంజనీరింగ్ , పాలిటెక్నిక్ విద్యార్థులకు లబ్ది చేకూర్చే విధంగా సాంకేతిక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు.

4. ఫార్ములా ఈ-రేసు కేసులో పూర్వ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఈరోజు అవినీతి నిరోధక శాఖ విచారణకు హాజరయ్యారు.

**PM VISAKHA VISIT**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సాయంత్రం ఆంధ్రప్రదేశ్, విశాఖపట్టణంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రధానమంత్రి సాయంత్రం 4.15 గంటలకు ప్రత్యేక విమానంలో ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ ప్రధానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వాగతం పలుకుతారు. అనంతరం సిరిపురం కూడలికి చేరుకొని అక్కడి నుండి బహిరంగ సభా వేదిక అయిన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకూ ముగ్గురూ రోడ్‌షోలో పాల్గొంటారు. సాయంత్రం సభా కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొంటారు. ఇదే వేదికపై నుంచి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో వివిధ పథకాలకు శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈ పర్యటనలో ప్రధానమంత్రి అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఏర్పాటుచేసే గ్రీన్ హైడ్రోజన్ హబ్ కు శంకుస్థాపచ చేస్తారు. పలు రహదారులు, రైల్వే పనులకు , మరో 10కి పైగా ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే , కొత్తగా నిర్మించిన , విస్తరించిన ఆరు రహదారులు, రైల్వే లైన్లు జాతికి అంకితం చేస్తారు.

(Desk)

**DY CM – SOLAR POWER**

రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుపై విధానపరమైన నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు మహిళా

స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా సోలార్ ప్లాంట్ల ఏర్పాట్ల పురోగతిపై మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖలతో కలిసి ఉప ముఖ్యమంత్రి ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క అన్నారు ఐదేళ్ల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

(PN)

**BANDI SANJAY - KARIMNAGAR**

కరీంనగర్ లో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు దోహదపడే విధంగా సాంకేతిక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు వినతిని అందజేశారు. ఉత్తర తెలంగాణలో కీలకమైన కరీంనగర్ ఎడ్యుకేషన్ హబ్ గా మారుతుందని, ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థులకు ఇక్కడ సమున్నత అవకాశాలు కల్పించవచ్చునని విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పీఎం శ్రీ పథకం కింద కరీంనగర్ జిల్లాలో ఎంపిక చేసిన 24 ప్రభుత్వ పాఠశాలలు , సిరిసిల్ల జిల్లాలో ఎంపిక చేసిన 16 పాఠశాలలకు ప్రతి పాఠశాలకు 40 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందచేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

(PTC, కరీంనగర్)

**PONNAM PRABHAKAR**

హైదారాబాద్  నగరంలోని శిశు సంరక్షణ సంస్థలలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు హైదరాబాద్ కలెక్టరేట్ లో జరిగిన  ఒక కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్రువీకరణ పత్రాలను అందచేశారు. దాదాపు   50కి పైగా ఉన్న శిశు సంరక్షణ కేంద్రాల్లో   2300  మందికి పైగా పిల్లలు ఉన్నారని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ రోజు  1330 మందికి వివిధ రకాల గుర్తింపు పత్రాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిషెట్టి , జిహెచ్ఎంసి కార్పొరేటర్ విజయారెడ్డి ,  యూనిసెఫ్ ప్రతినిదులు ,  ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. శిశు సంరక్షణ సంస్థల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు సరైన గుర్తింపు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వారికి కుల , నివాస, ఆధార్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.

(PN)

**KONDA SUREKHA - WARANGAL**

ఐనవోలు మల్లన్న జాతరను  జయ ప్రదంగా నిర్వహించడానికి  సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని  దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సూచించారు. సంక్రాంతి నుంచి మొదలయ్యే ఐనవోలు మల్లన్న జాతర ఏర్పాట్లపై హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , సంబంధిత శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై దిశ నిర్దేశం చేశారు.

(PTC, వరంగల్)

**HYDRA POLICE STATION - HYD**

హైదరాబాద్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తూ తెలంగాణ హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని బుద్ధ భవన్‌లోని బి-బ్లాక్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. దీంతో  ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసే వారిపై ఫిర్యాదులను ఇక మీదట హైడ్రా పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయనున్నారు. కాగా స్టేషన్ హౌజ్ ఆఫీసర్ గా ఏసీపీ స్థాయి అధికారి ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.  మరోవైపు హైడ్రా పోలీస్ స్టేషన్‌కకు కావలసిన పోలీస్ సిబ్బందిని కేటాయించాలని రాష్ట్ర డీజీపీకి హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది.  గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు , నాళాలు, చెరువులు,  కుంటల పరిరక్షణ కోసం ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేయగా ,
తాజాగా హైడ్రాకోసం ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది.

(PTC, **HYD**)

**ACB – ARVIND KUMAR**

ఫార్ములా ఈ-రేసు కేసులో ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఆయన ఏ   2గా ఉన్నారు. నిధుల బదలాయింపులో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. తన పరిధిలో ఉన్న హెచ్ఎండీఏ నుంచి  ఫార్ములా-ఈ ఆపరేషన్స్‌కు హెచ్ఎండీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ద్వారా నిధులు బదిలీ చేసిన వ్యవహారంపై ఏసీబీ విచారణ జరుపుతుంది. అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే నిధులు బదిలీ చేసినట్లు గతంలో అర్వింద్ కుమార్ ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు. ఆయన వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నేడు రికార్డు చేయనున్నారు. మరోవైపు పార్ములా-ఈ రేసు కేసులో బీఎల్ఎన్ రెడ్డి ఈడీ విచారణకు హాజరయ్యారు. రేసు జరిగినప్పుడు

ఆయన చీఫ్ ఇంజినీర్‌గా ఉన్నారు. 45.71 కోట్ల రూపాయలు విదేశీ సంస్థకు బదిలీ చేసిన వ్యవహారంలో ఈడీ కూడా దర్యాప్తు చేస్తోంది. ఏసీబీ కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసింది.

(Desk)

**KTR LUNCH MOTION**

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు , మాజీ మంత్రి తారక రామారావు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన పిటిషన్ విచారణకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది. అవినీతి నిరోధక శాఖ విచారణకు తన న్యాయవాదిని అనుమతించాలని కోరుతూ హైకోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. రేపు విచారణకు రావాలని ఏసీబీ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈనెల 6న ఆయనను ఏసీబీ విచారించాల్సింది. కానీ.. తన న్యాయవాదిని అనుమతించనందున హాజరుకాలేనంటూ.. ఆయన ఏసీబీ కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్లడంతో విచారణ జరగలేదు. దాంతో ఏసీబీ అధికారులు ఈనెల 9న విచారణకు హాజరు కావాలని నోటీసు జారీ చేశారు.

(Desk)

**TPCC MEETING**

ఏడాది పాలన తీరుపై సమీక్షించేందుకు ఈరోజు హైదరాబాద్ గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ కానుంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ , ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ , కమిటీ

సభ్యులు పాల్గొననున్నారు. ఏడాది పాలనతో పాటుగా కుల  గణన, స్థానిక సంస్థల ఎన్నికలపైనా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

(PN)

**KARIMNAGAR**

దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం కరీంనగర్ జిల్లా శంకటపట్నం మండలానికి చెందిన మెట్పల్లి మహిళా డప్పు కళాకారుల బృందానికి దక్కింది. ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ  వేడుకల్లో  ఈ మహిళా కళాకారులు  తమ డప్పు ప్రదర్శనను ఇవ్వనున్నారు. మొత్తం  15 మంది కళాకారుల బృందానికి  దాసారపు భవానీ నేత్రుత్వం వహిస్తున్నారు.

(PTC, కరీంనగర్)

**NALGONDA - COLLECTOR**

ఉత్తరప్రదేశ్ లోని నోయిడా లో నిర్వహించిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ ఇండియా పోటీల ఓపెన్ కేటగిరీ   245 కిలోల విభాగంలో నల్గొండ జిల్లా కేంద్రం లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా  బ్యాంక్ మేనేజర్ సాగర్ అమృత్ సింగ్ మొదటి బహుమతి సాధించారు. జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆయనను కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు.

(PTC, నల్గొండ)